# పాలగ్లాసులో ఉప్పురవ్వ

'కొత్త కుండా నీరు తీపి, కోరినా మగవాడు తీపి ....' అని మొదలై ఆ తర్వాత మనల్ని సంతోషంతో గిలిగింతలు పెట్టే ఓ జానపద గీతం మీకెలాగూ తెలుసు. కాని కొత్త పెళ్లాం కాఫీలో చక్కెరకి బదులు ఉప్పు వేసి, స్వయంగా తనే ఒళ్లోకి చేరి, ఆ కాఫీ మొగుడి చేత తాగిస్తే కలిగే మధురానుభూ తి మనలో కొద్ది మందికే తెలుసు. అలాంటి భాగ్యశాలులలో నేనొకడ్ని.

అసలేం జరిగిందంటే, గొప్పగా "పెద్దలు నిశ్చయించిరి గాన ..." అంటూ రెండేళ్ల క్రితమే నాకూ నా పెళ్లానికీ పెళ్లి జరిపించిన పెద్దలందరూ తతంగాలన్నీ పూర్తయ్యాక అడ్రస్ లేకుండా పారిపోవడంతో, అద్దె ఇళ్లు ఎలా వెదకాలో నాకు కాలేజీలో ఒక్క పరీక్షా లేకపోవడం కారణంగా నాకు చేతకాక (బియే చదువుకున్నావు తేలు మంత్రం రాదూ-అన్న ప్రశ్న ఉంది గా) ఇంత చదువూ చదివి 'ఇంత' ఇల్లు వెదకలేకపోయావు అని నన్ను నేనే తిట్టుకుంటూ హోటల్ భోజనం మఠం నిద్రగా విరహదారిలో జీవిత యాత్ర గడుపుతూండగా అనుకోకుండా అద్దె ఇల్లు వాటా దొరికింది. వెంటనే మా అత్తగారికి ఉత్తరం రాశాను. "మ॥౹౹స॥ అత్తగారికి అల్లుడు భద్రిరాజు నమస్కారములు. ఇల్లు దొరికింది ...ఫలానాతేదీని నేను వచ్చి మీ అమ్మాయిని తీసుకు వచ్చేస్తాను. చి॥ సౌ॥ మీ అమ్మాయి బుడతమ్మను ప్రయాణానికి సిద్ధం చేయండి" అంటూ వారం రోజులు సైమిచ్చాను.

చిరు చలి, గోరువెచ్చని వేడి, లేత పచ్చిమిరపకారం, తాత్కాలిక విరహం ఎంతో హాయిగా చెప్పలేనంత మజాగా ఉంటాయి కదా. పెళ్లాం ఘల్లు ఘల్లుమని అందెలు మ్రోగిస్తూ వాకిట్లోకి అడుగు పెట్టేరోజు మనకు కచ్చితంగా తెలిసినప్పుడు ఆ సస్పెన్స్ లేని విరహం ముద్దు ముద్దుగా ఉంటుంది కదా.

కాని ఈ అత్తలెప్పుడూ అన్నమాట మీద నిలబడరు కదా.

నేను మా అత్తవారింటి గుమ్మం ముందు ఎగురుకుంటూ రిక్షా దిగడం, వెంటనే మూసిన తలుపులు, దయ్యం తాళం కప్పా కనిపించడం ఏకకాలంలో జరిగాయి.

పక్కింటి వాళ్లని వాకబు చేస్తే మా అత్తగారి, మామగారి గురువుగారు పెద్ద ఎత్తున శ్రీరామ అఖండ భజన తలపెట్టారని, అందరూ ఆ ఊరు వెళ్లారని (నాభార్య బుడతమ్మ, సారెతో సహా వాళ్లతోనే నాలుగు రోజుల తర్వాత అటునుంచే మా ఊరువచ్చి మా కొత్త కాపరం పెట్టిస్తారని) తెలిసింది ....

నేను అదే రిక్షాలో కూలబడి బస్ స్టాండ్ కెళ్ళి గురువుగారి ఊరికి బస్సెక్కాను. నా ఒళ్ళు మంట కారణంగా పుష్యమాసపు చిరుచలి గ్రీష్మ తాపంలా నన్ను ఉడికిస్తోంది.

మిగతా మహిమల మాటేమో గాని గురువు గారికి చల్లని మంచి గంధం లాంటి చూపూ, పాలనురుగు లాంటి స్వచ్ఛమైన చిరునవ్వూ ఎప్పుడూ ఉంటాయి. ఆయన వ్యసనం దొరికిన వాళ్ళందర్నీ పందిట్లోకి ఈడ్చుకు వెళ్లి భోజనం పెట్టడం.

నేనెవరో కనుక్కోకుండా వాళ్లు పెట్టిన చక్కని భోజనం తింటూ, అంతకంటే తియ్యని రామనామం వింటూ తీవ్రంగా ఆలోచించడం మానలేదు నేను.

ఈ అఖండ భజన జరిగే రాబోయే మూడు రోజులూ మా అత్త మామలు ఇక్కడనుంచి కదలరు. కాగా, నా విరహం ఈరోజు దాటితే, (కొన్ని మందులు ఎక్స్‌పైరీ డేటు దాటాక విషాల 'యినట్లే) వికటించే ప్రమాదం ఉన్నది.

అందుచేత మరో మూడు వేల మంది భక్తురాళ్లతో చేరి అరమోడ్పు కన్నులతో రామభజన చేస్తున్న మా అత్త గారిని ఇవతలికి పిలిచి చెప్పాల్సిన అబద్ధమంతా సౌమ్యంగా విపులంగా చెప్పాను.

ఏమనీ?

1. రేపట్నుంచీ మా ఊళ్ళో హొటళ్లన్నీ హైద్రాబాద్ లో నీళ్ల కొరతకు సానుభూతిగా సమ్మె చేస్తున్నాయి.

2. నాకు వంట చేయడం రాదు. నేనోసారి వంకాయ కూర చేస్తుంటే అది పేలి వీధిలో నలుగురు గాయపడ్డారు.

3. అందుచేత చిః సౌః బుడతమ్మను నాతో పంపించి, భజనలు పూర్తయ్యాక అత్త మామలు మా కొత్త ఇంటిని పావనం చేయాలి.

గురువుగారు కరుణామయులు. నా కోరికను ఆమోదించేలా మా అత్తమామల్ని ఒప్పించడమే కాకుండా బుడతమ్మకు తోడుగా పరోపకారిణి సుందరమ్మ అనే నడి వయస్సు ఇల్లాలిని-భజనలో తీవ్రవాద పద్ధతుల కారణంగా ఆవిడకు గొంతు పూడిపోయిందిట-మాతో పంపారు.

సుందరమ్మగారు నిండుగా నిండైన ముఖాన పెద్ద బొట్టుతో శోభన దేవతలా మాకు తోడురాగా అత్తవారు ముందు జాగ్రత్తగా ఇచ్చిన ఊయలలో పెట్టె, పెట్టెమీద బెడ్డింగు, వగైరాలు పెట్టి తిన్నగా మా ఇంటికి చేరుకున్నాం.

అంతే సంగతులు.

వారం రోజులంటే వారం రోజులే. నేను విరహానికి పెట్టిన గడువు అది. అది దాటిపోయి అప్పుడే రెండు గంటలైంది.

విరహ తాపంతో నారక్తం ఆవిరై పోతోంది.

నేను అద్దె గది నుంచి రిక్షాల్లో తెచ్చి సర్దకుండా పడేసిన మంచం సుందరమ్మగారి కిచ్చి "పడుకోండి పిన్నిగారూ" అని నేనూ బుడతమ్మా పెరట్లోని జాజిపందిరి నీడలో చేరాం.

రాత్రి పదకొండున్నర.

బుడతమ్మ ఆడపిల్లలకి ఉండే సహజ మెళకువతో తను తెచ్చిన దుప్పటీ నేలమీద పరిచి, వెంటనే లేచి వెళ్ళి పెరటి తలుపు మూసి బయట గొళ్లెం పెట్టింది. "నేనెంత ఆరిందానో చూశావా? ఇంక నన్ను మెచ్చుకోవడమే నీ పని" అన్నట్లు నూతి గట్టుని నడుం ఆన్చి వయ్యారంగా నిలపడి వంకరమూతి పెట్టి గర్వంగా చూస్తోంది.

నేను ఇలాంటి సందర్భాలకు తగ్గట్లు సినీమాల కోసం సముద్రాల, పింగళి, ఆత్రేయ, శ్రీ శ్రీ, సినారె, వేటూరి, కొసరాజు-ప్రభృతులు రాసిన మంచి పాటల్ని గుర్తు చేసుకొంటున్నాను. చివరకు

"హాయి హాయిగా జాబిల్లి
తొలిరేయి వెండి దారాలల్లి
మందు జల్లి నవ్వసాగె ఎందుకో, మత్తు
మందు జల్లి నవ్వసాగె ఎందుకో" అనే శ్రీ శ్రీ గారి పాట అందుకున్నాను.

అంతలో చక్రవర్తి సంగీతంలా దూకుడుగా, సుందరమ్మగారు వచ్చేశారు. నేనూ, బుడతమ్మ ఒక్కసారి ఉలిక్కిపడ్డాం.

పరోపకారి కదా ఆవిడ! అందుచేత మాకు జలుబు చేయకుండా ఉండేందుకు రెండు మఫ్లర్లు, రెండు స్వెట్టర్లు తెచ్చారన్నమాట. థేంక్స్ చెప్పి ఆవిడని ఇంట్లోకి పంపడానికి పావు గంట పట్టింది.

ఆ తర్వాత నేను పరోపకారం ఎంత పాపమో లెక్చరివ్వబోతుంటే బుడతమ్మ తన కీచు గొంతుకతో పరోపకారం ఎంత గొప్పదో వివరించే శ్లోకం ఒకటి చదివింది.

నేను నా కోపాన్ని ఎలాగో మరిచిపోయి మళ్లీ పాట అందుకున్నాను. నా చరణం పూర్తయ్యాక పది నిమిషాలు బ్రతిమాలించుకుని చివరకు నన్ను ఏడిపించినంత పని చేసి డ్యూయెట్ లో తన చరణం అందుకుంది బుడతమ్మ.

మొదలు పెట్టిందో లేదో ఖంగుమని పరోపకారిణి సుందరమ్మ తలుపు బాదిన చప్పుడు వినపడి బెదిరిన కుందేలులా నా ఒళ్లోంచి ఎగిరి పడింది బుడతమ్మ.

....ధనా ధన్ ధన ధన ధన ధన ధనరే ... అలా లయగా తలుపు బాదుతోంది పరోపకారిణి సుందరమ్మ.

ముఖం ముడుచుకుని వెళ్లి, గొళ్లెం తీసి, సుందరమ్మ చేతిలోని పాలగ్లాసు చూసి చల్లబడి పోయింది బుడతమ్మ.

సుందరమ్మని వంటింట్లోంచి మా పెద్ద గదిలోకి సాగనంపి ఈసారి దాని గడియ కూడా వేసేసింది. అంటే ఆవిడ తలుపులు బాదినా మాకు గట్టిగా వినపడదన్నమాట.

నా ఒడిలో కూర్చొని సిగ్గుతో కళ్లు గట్టిగా మూసేసుకుని పాలగ్లాసు నా నోటికి అందించింది బుడతమ్మ.

పాలకు అదో కొత్తరకం రుచి వచ్చింది. అందమైన పెళ్లాం, అల్లరి వయస్సులో ఉన్నది,

ఒడిలో కూర్చుని మనకి ఇచ్చిన పాలకు అపూర్వమూ, అపురూపమూ, అనూహ్యమూ అయిన రుచి రావడంలో ఆశ్చర్యమేముంది!

నేను కొంతవరకూ తాగి ఆ పాలగ్లాసు బుడతమ్మ నోటి కందించాను. కొంచెం తాగి "బ్బ్బ్బ" అంటూ దూరంగా ఉమ్మేసింది ఆమె. సిగ్గుతో ఆమె మొహం మంకెన్న పూవు రంగుకి కందిపోయింది.

"సుందరమ్మ గొడవతో మతిపోయి, పాలల్లో పంచదార అనుకుని ఉప్పు వేశాను నన్ను క్షమించరూ" అంది.

"క్షమించను."

"బాబోయ్, గొడవోయ్!"

"చేసిన తప్పుకి శిక్ష తప్పదు" అని ఖచ్చితంగా చెప్పేశాను; చర్య తీసుకుంటూ.

**(కోస్తావాణి; దినపత్రిక – 14.1.1986)**

★